# విజేత

## - కామిశెట్టి చంద్రమౌళి

సంధ్య చీకట్లు ముసురుకుంటున్న వేళ.............

ప్రతి సాయంత్రం పడమటి గుట్టల్లోకి నిత్య యాత్రికుడిలా విసుగు లేకుండా నిశ్శబ్దంగా జారిపోయే పచ్చినెత్తుటి ముద్ద లాంటి సూరీడి లాగా ..........

ఈ ప్రపంచంతో తనకేమీ పట్టనట్లు పెద్దగా కూతవేస్తూ పరుగులు పెడుతూ పట్టాల మీద దూసుకొచ్చే కోనార్క్ ఎక్స్ ప్రెస్ కు .......... ఈ రోజేమయింది? ఇంకా రాలేదు!

అయినా ఇంకా ఎంతసేపు ఇలా కళ్ళు మూసుకొని ఈ రైలుపట్టాల పైన పడుకొని చచ్చేందుకై ఆ వచ్చే రైలు కోసం ఎదురు చూడటం? అసలే వీపుకి ఈ కంకరరాళ్ళ పదునైన మొనలు సూదుల్లా గ్రుచ్చుకుంటూంటేను! సమయానికి ట్రైన్లు నడిపే యోగ్యత లేని ఆ డ్రైవర్లు ఇంకా ఈ రైల్వేలని ఏం ఉద్ధరిస్తారు? పోనీ చచ్చిపోదామనుకునే నా లాంటి వాళ్ళను సమయానికి చావనైనా చావనీయరా?

ఆ మాటకొస్తే ఈ దేశంలో ఏ వ్యవస్థ మాత్రం సక్రమంగా పని చేస్తోందని అనుకునే వీలుంది?

ప్రొద్దున నిద్ర లేస్తూనే పాల ప్యాకెట్లలో నీళ్ళు, యూరియా కలిపి తయారుచేసిన కల్తీ పాలు అమ్మే రంగారెడ్డి, కనీసం వారం రోజుల తర్వాత కోతకొచ్చే ఆకుకూరల్ని రెండు రోజులకే రసాయనాలు వాడి పెంచేసి, తుంచేసి గంపలో పెట్టేసుకొని అమ్ముకునేందుకు వచ్చే ఆకుకూరల సుబ్బక్క, ఏ వారానికో పక్షానికో ఒకసారి షేవింగుకు వెళితే ముల్తానీ మిట్టి అంటూ ఇరవై రూపాయలు కూడా చేయని ఏదో మెత్తని బంకమట్టిని ముఖమంతా పట్టించి చెంపలరిగిపోయేలా రుద్ది కనీసం రెండొందలు గుంజేసే సెలూన్ శంకర, ఇంటి ముందర మురుగు నీటి కాల్వలో మురుగు మాత్రమే ఉంచి నీటిని మళ్ళించేసి పది రూపాయల బక్షీష్ కోసం చేయి చాపే తాగుబోతు మునెప్ప........ ఈ ఒక్కసారికి నాకే ఓటెయ్యండి మీ జీవితాలను బ్రహ్మాండంగా

www.sirimalle.com

మలిచేస్తా........మీరేపనీ చేయకుండా పడుకుని నిద్రపోతేకూడా మిమ్మల్ని కోటీశ్వరులుగా మార్చేస్తానంటూ తప్పుడుకూతలు కూసి ఐదేళ్ళకొకసారి మాత్రమే కన్పించే రాయుడుగారు........... ఇలా........అసలు ఈ ప్రపంచంలో అందరూ మోసాల్తో బతికేస్తుంటే ......... వీళ్ళెవరి మీదా ఎవరికీ కోపం రాదు....... కనీసం కాపీ కొట్టడం కూడా చేతగాని నేను అదృష్టం హీనమై ఒక్క పరీక్షలో ఏవో నాలుగు మార్కులు తక్కువొచ్చి ఫెయిలైతే.... ఇంతగా తిట్టాలా నన్ను? ఈ లెక్కన నిద్ర లేచిన దగ్గర్నుంచి ఆ టీవీలో నాన్న చూసే రాజకీయ చర్చల్లో పాల్గొనే నేతలంతా అంత సత్యసంధులేనా?........ పేద్ద ఠీవిగా ఫోజులిస్తూ ప్రసంగాలిచ్చే అధికారులంతా లంచాలెరుగని పరమహంసలా?....... ఆలోచిస్తూంటే అభిలాష్ మెదడు వేడెక్కిపోయింది.

లాభం లేదు.... ఈ కుక్క బ్రతుకు ఇంక అవసరం లేదు........ ఇంత మంది ఇన్ని అక్రమాలు చేసి బతికేస్తుంటే వారికి సుద్దులు చెప్పే ధైర్యం లేని మధ్యతరగతి బ్రతుకు ఏమాత్రం అవసరం లేదు. కనీసం నేను చచ్చిపోయింతర్వాతైనా ఈ మనుషులు మారుతారేమో !

అవును...... ఇంతకీ సులభంగా చచ్చిపోవాలంటే ఏ పద్ధతి మంచిది? ఉరి వేసుకోవడమా........ విషం త్రాగటమా........ మాత్రలు మింగటమా....... కాల్చుకోవడమా........ అమ్మో...... తలచుకుంటేనే భయమేస్తోంది!

అయినా చనిపోవాలనుకున్న తర్వాత ఆమాత్రం కష్టాన్ని భరించాలిగా....... అయినా...... ఏదో భయంగా ఉంది...... సరే.... రైలు అయితే ఒక్కసారే........ ఫట్...... యస్.....అదే కరెక్ట్!

********** *********** ***********

ఆ రోజు ....... డిగ్రీ రెండో సంవత్సరం పరీక్ష ఫలితాలు విడుదలైన రోజు ......

మధ్యాహ్నం భోజనాలైన తర్వాత నాన్న అమ్మతో కోపంగా అన్న మాటలు గుర్తుకొస్తున్నాయ్...........

"పాపి సముద్రానికెళితే అరికాలు కూడా నానలేదంట ........ నీ కొడుక్కి ఆ మాత్రం ధైర్యం కూడానా? సిగ్గుండాలే మనిషి జన్మ ఎత్తిన తర్వాత. అదుగో..... ఆ సత్యనారాయణమూర్తి కొడుకును చూడమను. వాడి బాబు, నేను ఒకే స్కూల్ లో పాఠాలు చెబుతున్నాంగా. వాడేమో కంప్యూటర్ ఇంజనీరై రేపో మాపో లక్షలు

www.sirimalle.com

సంపాదిస్తాడు. నీ సుపుత్రుడు మాత్రం ..... ఇదిగో.... ఇలా క్రికెట్ మ్యాచులు, సినిమాలు, షికార్లు......... అంటూ ఊరి మీద పడి బలాదూర్ తిరుగుతూనే ఉంటాడు..... ఏదీ కాదంటే ఆ కొత్త సెల్ ఫోన్ పట్టుకొని ఒకడే ఆ డాబా మెట్లపైన కూర్చొని పొద్దంతా చూస్తూ గడపడమేగా ఆయన గారు చేస్తున్న ఘనకార్యం!"

"అది కాదండీ.........మన అభిలాష్ కూడా ఈ సారి బాగానే............" అమ్మ ఏదో సర్ది చెప్పబోయేంతలో నాన్న మధ్యలోనే కలుగజేసుకొని, "ఆ......... చాలా బాగా చదివి ఐ.ఏ.ఎస్. పాసయ్యి మన ఊరికి కలెక్టర్ గా వస్తాడని కలలు కంటున్నావా పిచ్చి భాగ్యమా........... మనకు అంత అదృష్టం లేదే మొద్దు మొహమా..!" అని కోపంగా బదులిచ్చాడు.

"కాస్త చిన్నగా మాట్లాడండి. పిల్లాడు వింటాడు. ఆ పక్క గదిలోనే ఉన్నాడు. అయినా మనవాడు మాత్రమేనా పరీక్షల్లో ఫెయిలైంది? ఎంతమంది కాలేదు? ఎప్పుడూ వాణ్ణి తిడుతూనే ఉంటారు. ఇలా అస్తమానం తిడితే వయసొచ్చిన కొడుకు బాధపడతాడని కొంచెం కూడా ఆలోచించరా మీరు?" అమ్మ సర్దుతోంది.

"ఆ...... వయసొచ్చింది. వచ్చింది. ఎందుకు రాదు? ఊర్లో గాడిదకు కూడా వయసొచ్చిందే! అలా అనుకొని ఈ సారైనా ఆ పరీక్షల్లో పాస్ అవుదామన్న రోషం కూడా లేని వాడి గురించి ఎందుకే అంత తాపత్రయం? అసలు నిన్ననాలి. వాణ్ణనుకొని ఏమి సాధిస్తాం? అంతా నా ఖర్మ.... పుణ్యం కొద్దీ పిల్లలు, దానం కొద్దీ భార్య అని పెద్దలు ఊరికే అనలేదే......" నాన్న గొంతులో కోపం కంటే బాధే ఎక్కువ ఉన్నట్లనిపించింది జీవితంలో తొలిసారి అభిలాష్ కు.

********** *********** ***********

"ఏరా అభిలాష్, మనోడి బొమ్మ రేపే.....ఏడు థియేటర్లలో ఒకేసారి ....ఖడ్గమృగం.......... కొమ్ము విసిరితే ఎదురొచ్చే హీరోలెవరూ లేరింక ...... ఈసారి బాక్సాఫీస్ బద్దలేనమ్మా!", క్లాక్ టవర్ సెంటర్ దగ్గర సుభానీ కేఫ్ లో ఎదురుగా కూర్చున్న ప్రతీక్, నోట్లో కాలుతున్న సిగరెట్ తీస్తూ గర్వంగా రొమ్ములు విరుచుకుంటూ అభిలాష్ వైపు చూశాడు.

"అవున్రా, కానీ ఈసారికి టికెట్స్ కొనడానికి నా దగ్గర అన్ని డబ్బులు లేవురా.." అభిలాష్ బదులిచ్చాడు కొంచెం దిగులుగా.

"టికెట్స్ సంగతి నాకు వదిలెయ్ రా. ఓ రెండ్రోజులు శాంతి థియేటర్ లో అల్లరి చేసే బాధ్యత నీదేరా....... హాల్ అద్దిరిపోవాలి....... షోలో మన హీరో పేరు మార్మోగిపోవాలి. ఆ...... అన్నట్లు అన్నయ్య కటౌట్ కు పూలదండలు నీవే వేయాల్రోయ్..... పాలు ఓ ఆరు బిందెలు తెప్పిస్తా....... కటౌట్ కు పాలాభిషేకం మనమే చేయాలి....... చూసి ఆ ఒక్కోడి ఫ్యాన్స్ కుళ్ళిపోవాలి.... నాయాళ్ళు..... మొన్న వాని సిన్మాకు రెండు బిందెలు పాలు పోశార్రా ఆ డొక్కు కటౌట్ కు. మండిపోయింది నాకు..... సరే..... ఓ దమ్ము కొడతావా........ ఇదిగో......." సగం కాలిన సిగరెట్ ను అందించాడు ప్రతీక్.

"వావ్...... సూపర్ రా...... ఈసారి మన హీరో రికార్డ్స్ చూసి ఆయనకే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే ......... చేతిలో ప్లాస్టిక్ గ్లాస్ లో ఎర్రని ద్రవాన్ని సిప్ చేస్తూ ముద్దముద్దగా వస్తున్న మాటలను కంట్రోల్ చేసుకుంటూ అన్నాడు మస్తాన్ బాషా.

"అది సరేగానీ ఒరేయ్ ప్రతీక్..... వచ్చేవారం మన హీరో ఇక్కడికొస్తున్నాడు గదా......నువ్ జిల్లా ఫ్యాన్స్ అధ్యక్షుడు కదా మరి. ఆయనతో నాకు ఒక్క సారి సెల్ఫీ అవకాశం ఇప్పించరా....... ప్లీజ్..... నా జన్మ ధన్యం అనుకుంటాను..... ఎలాగైనా సరే...... ప్లీజ్ రా.........." వేడుకున్నాడు అభిలాష్.

"చూద్దాంలే...... ముందు మనహీరో సిన్మా సూపర్ హిట్ చేసి తర్వాత ఆయనొచ్చినప్పుడు సెల్ఫీ ఏం కర్మ........ కలిసి భోంచేద్దాంలే........ అయినా ఆయన దగ్గర మనకేం అడ్డముంది చెప్పురా అభీ...... సరేలే..... " భరోసా ఇచ్చాడు ప్రతీక్.

"అవున్రోయ్.... మర్చిపోయా...... సిన్మా గొడవలో పడి మన సన్ రైజర్స్ కథే మరచిపోయా....... ఇవాళ ముంబై ఇండియన్స్ తో మనోళ్ల ఢీ......... గుల్జార్ వీధిలోని ఆ షాహిద్ గాడితో చెప్పి ఓ ఐదు వేలు కట్టించు....... గెలిస్తే ఇరవై ఐదు వేలొస్తాయ్.... కనీసం రేపటి షోకు టికెట్స్ కొనడానికి, మిమ్మల్ని మేపడానికి సరిపోతుంది. డబ్బడిగితే ఇంటి దగ్గర మా నాన్న చర్మం వలిచేస్తానంటూ ఒకటే నస పెడ్తున్నాడు. ముందు నీవెళ్ళి ఆ పని చూడు అభిలాష్. మస్తాన్ గాడు నీ వెనుకే వస్తాడులే నీకు తోడుగా తీసుకెళ్ళు. ఆ....... జాగ్రత్త

www.sirimalle.com

రేయ్...... ఆ టూటౌన్ ఎస్సై విజయ్ మనలాంటోళ్ళ కోసం కాసుక్కూచున్నాడు. దొరికామా....... ఫినిష్ చేసేస్తాడు" చెప్పాడు ప్రతీక్.

"ఏరా మొన్నటి కోటింగ్ ఇంకా మర్చిపోలేదా........ గాళ్ ఫ్రెండ్ ఆషాతో కలసి జోరుగా బైక్ మీద వెళుతూ ఆ నీలం సెంటర్ దగ్గర లైసెన్స్ లేదని పట్టుబడింది గాక అనవసరంగా నోరు పారేసుకొని ఆ ఎస్సై విజయ్ చేత వీపు విమానం మోత మ్రోగించుకున్న విషయం.." చిన్నగా నవ్వుతూ టీజ్ చేశాడు మత్తుతో మూతబడుతున్న కళ్ళతో మస్తాన్ బాషా ప్రతీక్ ను ఉద్దేశించి.

"ఇప్పుడవన్నీ ఎందుకు రా.... ముందు మీ ఇద్దరూ లేవండి..... వెళ్ళి నేను చెప్పిన పని చూడండి" ఒకింత అసహనంగా చెప్పాడు ప్రతీక్.

"అలాగేలే..... మరిక వస్తాం......." పూర్తి కాలిపోయిన సిగరెట్ ను చివరి దమ్ము లాగి విసిరేస్తూ అక్కడి నుండి కదిలాడు అభిలాష్. వెనుకే మౌనంగా అనుసరించాడు మస్తాన్ బాషా.

************* ************** **************

"ఏమండీ..... బీరువాలో దాచమని రెండ్రోజుల క్రితం మీరిచ్చిన చీటీ డబ్బులో పదిహేనువేలు కన్పించటం లేదండీ...... " ఆదుర్దాగా చెబుతూ దగ్గరగా వచ్చింది భాగ్యం.

"ఏంటీ.... ఆ డబ్బులో పదిహేనువేలు కన్పించలేదా...... సరిగా చూడు భాగ్యం మరోసారి..... ఎక్కడికెళ్తుంది ఇంట్లో సొమ్ము మనకు తెలీకుండా", కాసింత ఖంగారుగా పలికాడు శంకర్రావు.

"మూడు నాలుగు సార్లు ఎంచి పెట్టానండీ.... నిజం..... పదిహేనువేలు తక్కువగా ఉంది..... " ఇబ్బందిగా నసిగింది భాగ్యం.

"ఇంట్లో మనమే కదా భాగ్యం ఉన్నది....... ఎవరొచ్చి తీసుంటారు... కొంపదీసి మన అభిలాష్ ఏమైనా తీసుంటాడా.... ఎప్పుడూ అలా చేయలేదే.."సాలోచనగా అన్నాడు శంకర్రావు.

"ఇంతకీ ఇప్పుడెక్కడికెళ్ళాడు ఇంత ఉదయాన్నే..... ఏం రాచకార్యాలు వెలగబెట్టడానికి వెళ్ళాడో.. ఏమో...." కొడుకు మీద కొంచెం అనుమానం కలిగింది.

"ఈ రోజు ఆ సినిమా హీరో బాబీ వస్తున్నాడని మొన్నటినుండి మన అభిలాష్ ఒకటే సందడి చేశాడండీ..... ఇప్పుడు గుర్తుకొస్తోంది...... అక్కడికేమైనా వెళ్ళాడేమో...నేను అడగటం మర్చిపోయా ఇంటిపనిలో పడిపోయి" చిన్నగా గుర్తుచేసుకుంటూ చెప్పింది భాగ్యం.

"హా..... అదీ కథ...... చివరికి ఎవడో సినిమా హీరో కోసం ఖర్చు పెట్టేందుకు తల్లిదండ్రులకు కూడా చెప్పకుండా సొంత ఇంట్లోనే దొంగతనం చేసే స్థితికి దిగజారిపోయాడన్నమాట మన పుత్రరత్నం...... భగవంతుడా ...... నేను ఎవరినీ ఇంతవరకు మోసం చేయలేదే..... ఇన్నేళ్ళలో ఏ రోజూ ఎవరినీ కష్టపెట్టలేదే...... నాకే ఎందుకు ఈ పరిస్థితి....... చివరికి నా కొడుకే నాకు మోసం చేస్తున్నాడా...... ఎంత బాధ అవుతోందో మనసుకు...... ఛఛ.... ఏంటీ నాకీ శిక్ష దేవుడా....." కళ్ళ నిండా నీళ్ళు వచ్చేశాయి శంకర్రావుకు.

ప్రక్కనే ఉన్న కుర్చీలో బరువుగా కూర్చుండిపోయాడు రెండు కళ్ళూ తుడుచుకుంటూ. చెట్టంత భర్తను ఎప్పుడూ అంత బేలగా చూసి ఎరగని భాగ్యం అది చూసి కాస్త భయపడింది. అప్రయత్నంగా తన్నుకొస్తున్న దు:ఖాన్ని ఆపుకుంటూ,"బాధ పడకండి ప్లీజ్...... మన అభి నిజంగా తీశాడో లేదో మరోసారి చూస్తాను... ఊరుకోండి" అంటూ సముదాయించడానికి ప్రయత్నించింది.

"నా రక్తమే నన్ను మోసం చేస్తుందని కలలో కూడా అనుకోలేదే ఎప్పుడూ..... చిన్నప్పటి నుండి ఎంత ప్రేమగా పెంచుకున్నాం...... అడిగిందల్లా తీసిచ్చాం...... వాడి సరదాలకు స్వేచ్ఛకు అడ్డురాకుండా పెంచాం...... మన అవసరాలను కూడా తగ్గించుకొని వాడికి అన్నీ సమకూర్చాం...... అంతెందుకు మొన్నటికి మొన్న ఇంట్లో ఇంకా చదువుకుంటున్న ఆడపిల్ల ఉందని, ఆ పాపకు కూడా అవసరాలు ఉంటాయని తెలిసి, వాడు డిగ్రీ చేరినప్పుడు కాలేజీలో మిగతా ఫ్రెండ్స్ లో చిన్నతనం అన్పించకూడదని వాడు అడగకుండానే అంత ఖరీదైన సెల్ ఫోన్ కూడా కొనిపెట్టాము కదే, అదే వాడిని ఇలా తయారు చేసిందనిపిస్తోందిప్పుడు నాకు..." ఆవేదనగా పలికాడు శంకర్రావు.

www.sirimalle.com

నాన్న అలా మాట్లాడటం ఎప్పుడూ చూడని తొమ్మిదో తరగతి చదువుతున్న సంధ్య దిగాలుపడిపోతూ నెమ్మదిగా నాన్న దగరకు వచ్చింది. కూతురు అమాయకమైన ముఖంలోకి సూటిగా చూస్తూ, "చూడమ్మా చిట్టితల్లీ, మీ అన్నయ్య చేసిన నిర్వాకం....."అంటూ ఏదో చెప్పబోతున్న తరుణంలో భాగ్యం ఒక్కసారిగా,"సంధ్యా, ఆ స్టౌ మీద బాణలిలో బెండకాయలు మాడిపోతున్నాయేమో ఒక్కసారి వెళ్ళి చూడమ్మా.... నేను వచ్చేస్తాను" అంటూ కూతురిని అక్కడి నుండి బయటికి పంపించేసింది.

"ఏమండీ, పిల్లల ఎదురుగా అలా బేలగా బాధపడొద్దండి. వాళ్ళు తట్టుకోలేరు... ప్లీజ్.... వాడొచ్చాక నేను కనుక్కుంటాన్లెండి... మీరేమీ బాధపడకండి. అయినా అభి కూడా గ్రహించేవాడేనండి. ఏదో తెలీక అలా చేసుండవచ్చు. అంతా సర్దుకుంటుంది లెండి. ఇక వదిలెయ్యండి ఈ విషయాన్నింతటితో ..... లేవండి హాల్లోకి వెళదాం" భర్తను అనునయిస్తూ ధైర్యం చెప్పింది భాగ్యం.

************ ******************* *************

ఈలలతో, కేకలతో, టపాసుల మ్రోతలతో, రిధమిక్ గా వాయిస్తున్న డ్రమ్ముల భజాయింపుతో పరమ కోలాహలంగా అభిమానుల సందడితో మార్మోగిపోతోందా థియేటర్ ఆవరణ. టపాసుల తాలూకు తెల్లటి పొగ అక్కడి వాతావరణాన్నంతటినీ క్రమ్మేసి జనాలను ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది. చేతుల్లో మోయలేనంత బరువున్న గజమాలలు, బంతిపూలు గులాబీలు కలిపి కట్టిన హారాలతో ముఖాల నిండా పులుముకున్న రకరకాల రంగులతో అభిమానగణాలు తమ హీరో రాక కోసం వేయికళ్ళతో నిప్పులు కురిసే ఎండలో సైతం ఆనందంగా ఎదురుచూస్తున్నారు.

"అదిగో... అన్నయ్యొచ్చేశాడు.......వాయించండి... డ్రమ్ములు..... అద్దిరిపోవాల......." గుంపులోంచి గట్టిగా అరిచారెవరో.

రయ్యమని వేగంగా థియేటర్ గేటు దాటి సూటిగా పోర్టికో క్రిందికి వచ్చి ఆగిందొక గ్రేకలర్ ఇన్నోవా. వెనకే అంతే వేగంగా దూసుకొచ్చింది హీరోగారి జాగ్వార్. ఇన్నోవా లోనుంచి ఎనిమిది మంది నల్లని టీ షర్టులు, నల్లని జీన్స్ ధరించిన బౌన్సర్స్ అని పిలువబడే ధృఢకాయులు ఒక్కసారిగా వేగంగా కదిలి జాగ్వార్ ను చుట్టుముట్టారు. ఒకరి చేతిని మరొకరి చేతిలో గట్టిగా పట్టుకొని కారు చుట్టూ వలయంలా నిలబడ్డారు.

www.sirimalle.com

వారిలోంచి ఒకడు వెనుక డోర్ ను తీసి పట్టుకోగా విలాసంగా బయటికి అడుగేశాడు హీరో బాబి. నల్లని కళ్ళద్దాలలో ఠీవిగా నిలబడి అందరికీ అభివాదం చేశాడు. అక్కడే నిలబడిన ఫ్యాన్స్ అధ్యక్షుడు ప్రతీక్ ఆయనకు గజమాలను వేస్తూ చిరునవ్వుతో కరచాలనం చేశాడు.

"బ్లడ్ స్టార్, బ్లడ్ స్టార్ .... " అంటూ క్షణంలో అభిమానుల చప్పట్లు, కేకలు, అరుపులు, టపాసుల మ్రోతలు మిన్నంటాయ్. తమ అభిమాన హీరోతో కలసి కరచాలనం చేయాలని, ఆయనతో ఒక్కసారైనా మాట్లాడాలని, వీలైతే ఒక సెల్ఫీని తీసుకోవాలని, ఆయనకు పూలహారం వేసి అభిమానాన్ని చాటుకోవాలని తహతహలాడుతూ అభిమానులు గుంపులుగుంపులుగా ముందుకు తోసుకొస్తూంటే నిర్దాక్షిణ్యంగా బౌన్సర్స్ వారిని ప్రక్కకు తోసిపేస్తూంటే జనాలు ఒకరిమీద ఒకరు పడుతూ లేస్తూ తోస్తూ అరుస్తూ వగరుస్తూ త్రొక్కిసలాడుతూ పోటీపడుతున్నారు.

అంతసేపూ ప్రతీక్ ప్రక్కనే నిలబడి ఉన్న అభిలాష్ ఒక్కసారిగా ఎగ్జైట్ మెంట్ ను ఆపుకోలేకపోయాడు. గట్టిగా "బ్లడ్ స్టార్ బాబీ..... జిందాబాద్....... బ్లడ్ స్టార్ బాబీ ....... జిందాబాద్" అని అరుస్తూ హీరో వైపుకు దూసుకువచ్చేశాడు. అంతే........ క్షణకాలంలో ఏం జరిగిందో అర్థమయ్యేలోపు అభిలాష్ ను కాలర్ పట్టి ఒక్కసారిగా బలంగా గుంపు లోనికి గుంజేశారెవరో. విపరీతమైన ఆ తోపులాటలో షర్ట్ కున్న మూడు గుండీలు తెగిపోయాయి. జుట్టు రేగిపోయింది. మూడువేల రూపాయలు పెట్టి ప్రత్యేకంగా కట్టించిన గులాబీహారాన్ని చేతిలోంచి పుటుక్కున లాగేస్తూ దూరంగా సెట్టేశారెవరో. తిరిగి చూద్దామనేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా తోసేస్తుంటే గుంపు నుండి కొంత ప్రక్కకు జరిగి ఎక్కడున్నాడో తెలుసుకొని తన హీరో వైపుకు చూశాడు. అప్పటికే హీరో బాబి థియేటర్ లాంజ్ లోనికి వెళ్ళబోతున్నాడు. అతనికి కుడివైపున ప్రతీక్ నవ్వుతూ ముందుకు వంగి చెవి దగ్గర ఏదో చెబుతున్నాడు.

ఒక్కసారిగా ఆవేశం కట్టలు త్రెంచుకుంది అభిలాష్ కు. "రేయ్ ప్రతీక్, నేనొస్తున్నాను. ఒక్క క్షణం ఆగరా. రేయ్... ప్రతీక్.... సార్...... బాబీ సార్......ఈ అరేంజ్ మెంట్స్ అన్నీ నావే సార్...... నాతో మాట్లాడండి సార్...... ప్లీజ్...... ఒక్కసారి......... సార్...... " అంటూ గట్టిగా అరుస్తూ జనాలను ఒక్క ఉదుటున తోసేస్తూ ముందుకు ఉరికాడు అభిలాష్.

కన్ను మూసి తెరిచేంతలోపు హీరో దగ్గరకు చేరాడో లేదో ....... "హే గయ్స్ ..... గెట్ హిమ్ అవే..... స్టుపిడ్ ఫెలోస్........ కనీసం మేనర్స్ ఉండవు కదా వీళ్ళకు ...... ఎక్కడి కొచ్చినా ఇలాంటి పెధవలు కొంతమందైనా కన్పడతారు...... పేద్ద న్యూసెన్స్ కేసులు....... డర్టీ ఫెలోస్...... కిక్ హిమ్ అవే...... ఇదో పెద్ద ఫ్రస్ట్రేషన్ మిస్టర్ ప్రతీక్........ లెట్స్ గో....." స్టైలిష్ గా ఇంగ్లీష్ లో బౌన్సర్స్ కు ఆర్డర్ పాస్ చేసి వేగంగా వెళ్ళిపోయాడు హీరో. కనీసం ఒక్కసారైనా వెనుతిరిగి చూడకుండా మౌనంగా ఆయన వెంట థియేటర్ లోపలికి వెళ్ళిపోయాడు ప్రతీక్. వారి వెనకే థియేటర్ లాంజ్ గేట్లు మూసుకున్నాయ్.

ఏం జరిగిందో అసలు అర్థం కాలేదు అభిలాష్ కు. తన అభిమాన హీరో వస్తున్నాడని నెల రోజుల నుండి మిగతా పనులన్నీ వదులుకొని ఆ ప్రతీక్ చెప్పిన పనులన్నీ చేసిపెడితే, తీరా ఆయన వచ్చింతర్వాత ఏమిటిలా జరిగిపోయింది...... అసలు ఇంటి దగ్గర అమ్మనాన్నకు కూడా చెప్పకుండా బీరువాలోని డబ్బు కూడా తీసి మూడువేలు పోసి గులాబీహారం కట్టించుకొని ఇక్కడికొస్తే ఇలా జరిగిందేమిటి....... సరేలే...... కనీసం హీరో బాబీకి నేనేవరో తెలియకపోవచ్చు గానీ ఈ ప్రతీక మాత్రం ఎందుకలా చేశాడు?

అంటే..... ఈ మనుషులంతా ఇంతేనా........ ఆయన సినిమా ప్రమోషన్ కోసం ఆయనొచ్చాడు...... ఈ ప్రతీక్ గాడు ఆయన దగ్గర సాన్నిహిత్యాన్ని పెంచుకోవడానికి....... తర్వాత తన పరపతిని పెంచుకొని ఎదగడానికి నన్ను వాడుకున్నాడన్నమాట! ........ ఎంత స్వార్థం ....... ఎంత ద్రోహం ........ రాస్కెల్స్ ........ అందరూ ఇంతేనా ......? ఆలోచిస్తూ షర్టుకు ఊడిపోయిన గుండీల స్థానంలో పిన్నీసు పెట్టుకుంటూ మెల్లగా బయటికి వస్తూ అక్కడే ఉన్న హీరో కటౌట్ ముందు ఒక్క క్షణం నిలబడ్డాడు. సరిగ్గా మూడు రోజుల ముందు ఆ కటౌట్ నే తన అభిమాన హీరోగా భావించి వెర్రి ఉన్మాదంతో రెండువేలు తగలేసి కొన్న పాలతో తాను చేసిన అభిషేకం తాలూకు మరకలు తనను వెక్కిరిస్తున్నట్టు అన్పించాయ్.

అమ్మ నాన్నలు గుర్తొచ్చారు. నిర్మలమైన వారి తెల్లని మనసులపై తాను చిమ్మిన బురద మరకల్లాగా అన్పించాయవి. మనసు మూగగా రోదించింది.

ఇన్నాళ్ళూ తను సినిమాలని, క్రికెట్ అని, ఫ్రెండ్స్ తో కబుర్లని, కాలేజీలో ఔటింగ్స్ అని, సెల్ ఫోన్ లో ఛాటింగ్స్ అని........... ఇలా ఎంత టైం వేస్ట్ చేసుకున్నాడో, దాని ఫలితంగా పరీక్షల్లో ఫెయిలై కూడా బాధ్యత

www.sirimalle.com

లేకుండా స్నేహితులతో తిరిగాడో, ఆ సమయంలో తల్లిదండ్రులు ఎంత మనసు నొచ్చుకున్నారో ఒక్కసారి గుర్తొచ్చాయి. అదే సమయంలో వాళ్ళు తనపై పెట్టుకున్న నమ్మకం, తను బాగా చదివి మంచి జాబ్ సంపాదించి గొప్పగా బ్రతకాలన్న వారి ఆరాటం .... అందుకై వాళ్ళు చేస్తున్న త్యాగాలు కూడా గుర్తుకొచ్చాయ్. అప్రయత్నంగా కళ్ళనుండి నీళ్ళు వెచ్చగా జలజలా రాలాయి. మనసంతా అపరాధభావన చోటు చేసుకుంది.

ఎందుకింత పనికిమాలిన వాడిలాగా మారిపోయాన్నేను..... ఇన్నాళ్ళూ వాళ్ళ మాటల వెనుక నా గురించి వారు పడే తపనను ఎందుకు అర్థం చేసుకోలేకపోయాను....... తన గురించి అంతగా ఆలోచించే ఆ ప్రేమమూర్తులను ఇన్నాళ్ళూ మోసం చేశాను....... చివరికి వాళ్ళు తనమీద పెట్టుకున్న నమ్మకాన్ని కూడా వమ్ము చేసి స్వంత ఇంటిలోనే బీరువాలోని డబ్బును దొంగతనం చేసే స్థితికి దిగజారిపోయాను....... ఛఛ....... తన మీద తనకే సిగ్గేసింది.

ఇంతగా పతనమైన నేను ఇంకా ఏ ముఖం పెట్టుకొని ఇంటికెళ్ళాలి?....... నా లాంటి వాడికి బ్రతికే హక్కు కూడా లేదు..... యస్ ........ నేను బ్రతక్కూడదు.........!" నిర్ణయించేసుకున్నాడు అభిలాష్.

************* *************** *************

వీపుకి కత్తుల్లా గుచ్చుకుంటున్న కంకర రాళ్ళొకవైపు ......... మసకచీకట్లు ముసురుకుంటున్న మునిమాపువేళ.......... కుయ్...... కుయ్..........మంటూ రెండు చెవుల్లో హోరెత్తిస్తూ చేతులకు కాళ్ళకు కక్షగా కుట్టేస్తున్న రక్తపిశాచాల్లాంటి దోమలొకవైపు..........ముక్కుపుటాలను బద్దలు కొట్టేస్తూ వాంతులయ్యేంత గబ్బు కంపొకవైపు.......నరకమెక్కడో లేదు......ఇక్కడే ఉందా?.......... ఇంకెంతసేపు చావు కోసం ఈ నిరీక్షణ..... అనిపించింది రైలు పట్టాలపై నిర్వేదంగా పడుకొన్న అభిలాష్ కు. ఇంకొద్ది సేపట్లో పట్టాలపై దూసుకొచ్చే ఆ ఎక్స్ ప్రెస్ రైలు ఇనుప చక్రాల క్రింద నలిగి..... తునాతునకలయ్యే ఈ శరీరం పట్ల ఇంకా నాకెందుకు ఈ అనురక్తి.....?

అయినా ... తల్లిదండ్రులను మోసగించిన వాడికి ఇంతకంటే గొప్ప అనుభవం ఏంకావాలి .......నిరీక్షణ లోని ప్రతిక్షణం.... అభిలాష్ మనసులో విపరీతమైన మానసిక సంఘర్షణ జరుగుతోంది.

www.sirimalle.com

అవును........ చెట్టంత ఎదిగిన నేను ఎప్పుడైనా అమ్మనాన్నలకు చీమంతైనా సాయం చేశానా ఇన్నేళ్ళలో.....? అన్నగా చిన్నారి చెల్లెలి పట్ల బాధ్యతగా మసలుకొన్నానా ఎప్పుడైనా.......... ఎప్పుడూ నా స్వార్థం కోసం....... నా అవసరాల కోసం..... వాళ్ళను ఉపయోగించుకున్నానే గానీ వాళ్ళకు ఉపయోగపడలేదే........ అంతర్మధనం ప్రారంభమైంది అభిలాష్ మనసులో.

కనీసం ఇప్పుడైనా వారికి నిజాయితీగా క్షమార్పణ చెప్పి మరణం కౌగిలిలోనికి మనశ్శాంతిగా చేరుకుంటే..... ఈ బాధ కొంచెం తగ్గుతుందేమో......

ప్యాంట్ జేబు లోంచి నాన్న కొనిచ్చిన కొత్త సెల్ ఫోన్ చేతిలోనికి తీసుకున్నాడు అభిలాష్. స్విచాన్ చేయగానే స్క్రీన్ మీద హీరో బాబీ విలాసంగా బైక్ మీద కూర్చొని వున్న బొమ్మ ప్రత్యక్ష్యమైంది. విరక్తిగా నవ్వుతూ నాన్న నెంబర్ కు డయల్ చేశాడు.

"నాన్నా..... ఎక్కడున్నావ్ రా...... మధ్యాహ్నం నుండి నీ కోసం వెదుకుతున్నాం....... థియేటర్ దగ్గర తొక్కిసలాటలో పదకొండుమందికి గాయాలై ఆస్పత్రికి వెళ్లారని విని దగ్గరలోని ఆస్పత్రులన్నీ తిరుగుతున్నాం నాన్నా........ నీకేం కాలేదు కదా........ భోంచేశావా... లేదా....... అమ్మ సాయంత్రం నుండి నీవు ఎక్కడికెళ్ళావో తెలీక ఏడుస్తోంది..... చెల్లెలు దిగులుగా ఉందిరా నాన్నా..... మాట్లాడురా....... ఎక్కడున్నావ్ చెప్పరా నాన్నా......" నాన్న కంఠంలో ఆదుర్దా..... తను కన్పించలేదన్న బాధ ప్రస్ఫుటంగా తెలుస్తోంది.

గుండెలు పిండేసే దు:ఖం కట్టలు తెగి ఏరులై ప్రవహిస్తోంది తన మనసులో. కొంత సర్దుకొని, "నాన్నా....... నేను....... బీరువాలో డబ్బులో నుండి......" పూర్తి చేసే లోపలే మళ్లీ నాన్న కంఠం అటు వైపు నుండి," అవన్నీ మళ్లీ చూసుకుందాం. ఎక్కడున్నా వెంటనే ఇంటికొచ్చెయ్ నాన్నా.... నాకేదో భయంగా ఉంది...... నీ మౌనం వింటుంటే........"

అంత దూరం నుండి ఫోన్లో సైతం తన మౌనాన్ని కూడా నాన్న మనసు వినగలుగుతోందంటే నాన్న తనను ఎంత ప్రేమిస్తున్నాడో అర్థమౌతోంది అభిలాష్ కు. తను చేసిన పాపానికి నిష్కృతి చేసుకోవాలనుకున్నాడు. అయితే ఇప్పుడేం చేయాలి........ మరణంతో వారి మనసులకు మరింత బాధను చేకూర్చి చేతగానివాడిలా

చెడ్డపేరు మిగుల్చుకోవాలా........ లేక జీవితాన్ని సవాల్ గా స్వీకరించి అందులో గెలిచి బ్రతుకును సార్థకం చేసుకోవాలా.......?

దూరంగా ........ వెలుగు రేఖ ఒకటి కన్పించింది ఉన్నట్లుండి........ రైలుపట్టాల నుండి శబ్దప్రకంపనలు మొదలయ్యాయ్........

వెలుగు రేఖ మరింత ప్రకాశవంతమౌతోంది.......... శబ్దప్రకంపనలు శరీరాన్ని భయకంపితం చేయడం అభిలాష్ కు తెలుస్తోంది.........

వచ్చేస్తోంది......... మృత్యుశకటం శరవేగంగా పరుగులెత్తుతూ సమీపిస్తోంది........... నిర్ణయం జరిగి తీరాలిక........ ఒకటే జీవితం......... పోతే మళ్ళీ రాదిక...... ఎప్పటికీ......

సమయం లేదు మరి .......... చీకటిని తిడుతూ కూర్చునే కంటే చిరుదివ్వెను వెలిగించే వాడే గొప్పవాడవుతాడని ఎప్పుడూ చెప్పే నాన్న మాటలు గుర్తొచ్చాయ్..... తన మీదే పంచప్రాణాలను పెట్టుకొన్న తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చి సరైన కొడుకుగా, జీవితంలో అసలైన విజేతగా నిలవాలని నిర్ణయించుకున్నాడు.

"నో.......నేను చావను..... గెలుస్తాను......." గట్టిగా అరిచాడు అభిలాష్. అది ఆర్తనాదం కానేకాదు........ జీవితం పట్ల ప్రేమ........ తల్లిదండ్రుల పట్ల విశ్వాసం...... జన్మనెత్తిన తొలి క్షణం పసిబిడ్డ పెట్టే తొలి స్వీయ పరిచయ జీవనాదం ...... నేనొచ్చేశానంటూ ఈ లోకం లోనికి చెప్పేందుకు వేసే ..... కేక !

ఇప్పుడు అభిలాష్ చేసింది ......... జీవననాదం ....... తనని తాను పరివర్తన చెందిన మనిషిగా పరిచయం చేసుకునేందుకై వేసిన....... పొలికేక!

నిర్భయుడై...... లక్ష్యసాధకుడై ...... మారిన మనిషై...... మననిషిగా ఎదగడానికి పడిలేచిన కెరటంలా....... ఒక్క ఉదుటన రైలు పట్టాలపై నుండి సమీపిస్తున్న మృత్యుశకటం నుండి దూరంగా వడివడిగా.... దృఢచిత్తంతో...... తల్లిదండ్రులను క్షమార్పణ కోరి..... జీవితాన్ని అర్థవంతంగా గడిపేందుకు దీక్షబూని....... ఊరి వైపు అడుగులేస్తూ........ అభిలాష్ ముందుకు నడిచాడు....... మృత్యువును జయించాడు.

ఇప్పుడతని మనసులో వ్యవస్థ పట్ల నమ్మకమే తప్ప..... ఎలాంటి ఫిర్యాదులు లేవు....... ఎవరి పట్ల కోపం... ద్వేషం లేనేలేవు........ అతను ఇప్పుడు ...... రాబోయే రోజుకు కొన్ని గంటల ముందే ఉదయించిన గ్రహణం వీడిన మరో సూర్యుడు ...!